# వెర్రి'అమ్మ'లు

-స్పందన

"రమగారూ. మీ ప్రయాణం ఏమయ్యింది? రిజర్వేషన్ చేయించారా?" వాకింగ్ చేస్తూ అడిగారు నిర్మల.

"ఇంకా ఏమీ తేలలేదు నిర్మలా. నాన్నగారిని నేను చూసుకొంటాను. నువ్వు అమ్మాయి దగ్గరకు వెళ్లు అంటున్నారు మా వారు. కానీ అట్లా వదలడానికి నాకూ మనస్కొప్పడం లేదు. మావయ్యగారి చాదస్తం గురించి తెల్సుకదా. నేనయితే ఒక్కసారి చిన్న పిల్లలను మందలించినట్లు మందలించి, వివరంగా చెబితే కొంచెం తగ్గుతారు. మావారు గట్టిగా మాట్లాడలేరు. కష్టమవుతుందేమోనన్పిస్తుంది" రమ నడుస్తూనే ఆయాసపడుతూ చెప్పారు.

నిజమే. రమ మామగారి సంగతి మా కాలనీలో అందరికీ తెల్సు. ఆయన పనులన్నీ టైమ్ టు టైమ్ జరిగిపోవాలి. చాలా చాదస్తం. ఆ చాదస్తంతో ఎంత విసిగించినా రమ ఆయనను చిన్న పిల్లాడిని చూసినట్లు చూస్తూ, ఓర్పుగా నెట్టుకొస్తుంది. రమలాంటి కోడలు దొరకడం ఆయన అదృష్టమని మేమందరమూ అనుకొంటాము.

రమ కూతురు మాధవి పెళ్లిలో బిజీగా ఉండి, ఆయనకు సౌకర్యంగా జరగదేమోనని ఒక కుర్రాడిని ఆయన పనులకు ప్రత్యేకంగా పెట్టారు.

నేను, రమ, నిర్మల మంచి స్నేహితులం. ఇంచుమించుగా ఒకటే వయస్సు వాళ్లవ్వడం వల్ల మా మధ్య చనువు పెరిగింది. ఎంత చనువు ఉన్నా ముగ్గురమూ ఒకళ్లని ఒకళ్లు గౌరవించుకుంటూ మాట్లాడుకుంటాం. రోజూ సాయంకాలం ఐదు నుండి ఆరు గంటల వరకూ కలిసి వాకింగ్ చేస్తూ కష్టసుఖాలు పంచుకోవడం మా జీవితంలో ఒక భాగమయిపోయిందనే చెప్పాలి.

"పోన్లే రమా! వెళ్లిరండి. పాపం అక్కడ మాధవి వేవిళ్లతో బాధపడ్తుంది. మధ్య మధ్యలో మేము చూస్తుంటాం లెండి'' భరోసాగా అన్నాను.

"ఔను లక్ష్మిగారు చెప్పినట్లు వెళ్లిరండి. మావయ్యగారిని చూసుకొంటాం. మేం మాత్రం ఆయన్ని చూసేది ఏముందిలెండి. అన్నీ చెయ్యడానికి సర్వెంట్ ఉండనే ఉన్నాడు. ఆయనకి ఇష్టమైన మెత్తటి వంటలు చేసినప్పుడు తీసుకెళ్లి ఇచ్చి వస్తుంటాం'' నిర్మల కూడా నచ్చజెప్పారు.

"ఏం పిల్లలో ఏం లోకమోనండి బాబూ. మాధవినే వచ్చి వేవిళ్లు తగ్గే వరకు ఉండి వెళ్లమంటే విన్పించుకోదు. వీళ్లకు సోద్యాలు ఎక్కువయిపోయాయి. మనప్పుడయితేనా! చక్కగా నెల తప్పిన వెంటనే అమ్మ దగ్గర కెళ్లి, మన నోటికి సహించినవి అడిగి చేయించుకొని, రెస్ట్‌గా ఉండి వచ్చేవాళ్లం. ఇప్పటి అమ్మాయిలు, అబ్బాయిలూ కూడా ఒకరిని వదలి ఒకళ్లు ఉండమంటున్నారు'' రమ కూతురి గురించి కొంచెం విసుగ్గా అన్నారు.

"ఔను. నిజమే. ఇప్పటి పిల్లలు ప్రతీ పనీ చోద్యంగానే చేస్తున్నారు. మా అర్చన దగ్గరకు వెళ్లినప్పుడు ఎంత విసుగొచ్చిందో తెల్సా. అసలే నాకు బి.పి. అక్కడి పద్ధతులు, వాతావరణం అస్సలు నచ్చలేదు. అంతా హిందీగోల, ఇంగ్లీష్ గోల. మీకు తెల్సుకదా. నాకేమో తెలుగు తప్ప ఏమీ రావు. ఇక్కడ మనూర్లో అయితే మీరంతా అండగా ఉంటారు. అక్కలో, ఆడబడుచులో సాయానికి రమ్మంటే వస్తారు. అంత దూరం ప్రయాణానికే రెండు రోజులు పడ్తుంది. ఎవరి సంసారం వదులుకొని ఎవరు వస్తారు చెప్పండి. ఇటువంటి చోద్యాలు మనప్పుడున్నాయా? పుట్టింటివాళ్లు ఏదో ఓ మంచి రోజు చూసి ఏడో నెలలో పురిటికి తీసుకు వెళ్తే, తిరిగి పిల్లకు ఐదో నెల వచ్చేకే పంపించేవారు. తల్లులంసంసారాలు విడిచిపెట్టుకొని వెళ్లి అన్నేసి రోజులుండాలంటే కష్టం కదా. అందుకే అర్చనతో చెప్పేసాను. రెండవసారి మాత్రం నువ్వే నా దగ్గరకు రావాలి అని'' నా ఉక్రోషం అంతా కక్కేసి ఊపిరి పీల్చుకొన్నాను.

"ఔను. ఇటువంటి విషయాల్లో ఎవరమూ ఏమీ చెయ్యలేకపోతున్నాం. మా వియ్యపురాలు లలిత డెలివరీకి అమెరికా వెళ్లి వచ్చారు కదా. ఆమె వాళ్లమ్మాయి గురించి చెబుతుంటే, ఒక తల్లి కూతురి గురించి మాట్లాడుతున్నట్టు లేదు. అత్తగారు కోడలి మీద కంప్లైంట్స్ చెప్పినట్లు చెప్పి ఒకటే గోల.చంటి పిల్లాడికి ఏం చేస్తున్నా "ఉండమ్మా. అట్లా చెయ్యొచ్చో లేదో'' అంటూ నెట్ ఓపెన్ చేసి చూడడమట. ఏదీ స్వతంత్రంగా చెయ్యడానికి లేదు. పని మనుషులుండరు కదా. ప్రతీ పనీ మనమే చేసుకోవడం. డిష్ వాషర్ అంటారు. దాంట్లోనేమో అన్నీ కడిగే వెయ్యాలట. బట్టలు మాత్రం వాషింగ్ మిషన్‌లో బాగానే ఉన్నాయి. మన ఇండియాలో ఐతే పనిమనుషుల్ని పెట్టుకొని దర్జాగా చేయించుకొంటాం. లక్ష రూపాయలు ఖర్చు చేసుకొని వెళ్లి అడ్డమైన పనులూ చేస్తూ, అన్నిటికీ వీళ్లమీద ఆధారపడడం. ఏంటోనండి వదినగారూ. మనప్పుడు ఏ ఇంటర్‌నెట్‌లో చూసి మన పిల్లల్ని పెంచాం చెప్పండి. మన పెద్దవాళ్లకన్నా ఈ ఇంటర్‌నెట్ గొప్పదా? లలితే చక్కగా ఇండియా వచ్చి డెలివరీ అయిన తరువాత వెళ్తే చక్కగా ఉండేది కదా. ఏమో వదినగారూ. నేను ఎక్కువ రోజులు ఉండలేనన్పిస్తుంది' అంటూ ఫోన్‌లో చెప్పి బాధపడి, ఆరునెలలకు అని వెళ్లినామె మూడునెలలకే తిరిగి వచ్చేసారు'' నిర్మల నిట్టూర్చింది.

"ఔను. ఇప్పటితరం పిల్లలకి పెద్దవాళ్ల అవసరం అంతగా కన్పించడం లేదు. అన్నీ వాళ్లకే తెలుసునన్న అహంకారం కూడా పెరిగింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి సుమా! మన అల్లుళ్లు మాత్రం మన ఆయనలకన్నా జాగ్రత్తగా

పెళ్లాల్ని చూసుకొంటున్నారు. పెళ్లాలికి జ్యూస్ తీసివ్వడం, ఫ్రూట్స్ కట్ చేసి తినిపించడం, చిన్న చిన్న పనుల్లో సాయం చేస్తూ వెనకాల వెనకాల తిరుగుతుండడం, ఇవన్నీ చూస్తే ఒక విధంగా హేపీ అన్పిస్తుంది. ఒకవిధంగా చూస్తే మరీ ఓవర్ కేర్ అన్పిస్తుంది. ఇప్పటి అబ్బాయిలందరూ ఇట్లాగే ఉంటున్నారు. అందుకే అమ్మాయిలకు వాళ్లు చేసే 'అపురూపం' ముందు మనం చూపే ప్రేమ, తపన బలాదూర్‌గా అన్పిస్తున్నాయి'' నా మనస్సులో మాట చెప్పేశాను.

రమ, నిర్మల నా మాటలకు ఫక్కున నవ్వారు.

"మనం మన జనరేషన్‌లో ప్రతీ పనికి అమ్మ మీదగాని, అత్తగారిమీదగాని ఆధారపడేవాళ్లం. ఏ పని చెయ్యాలన్నా వాళ్లను సంప్రదించకుండా చేసే వాళ్లం కాదు. మా మాధవికి ఏదన్నా సలహా ఇవ్వబోతే మీ అల్లుడిగార్కి అట్లా ఇష్టముండదమ్మా అనో, మీ అల్లుడిగారిని అడిగి చెబుతాననో అంటుంది. అప్పుడన్పిస్తుంది వీళ్ల విషయంలో అనవసరంగా కలుగజేసుకొన్నానని. ఇదీ ఒక విధంగా మంచిదేలెండి. వాళ్లు ఒకరిని ఒకరు గౌరవించుకొని ఒకే అభిప్రాయంతో ఉండడం చూస్తే ఒక్కోసారి ముచ్చటేస్తుంది'' రమ అన్నారు.

"రమా. మీరు చెప్పేది ఎట్లా ఉందంటే 'ఈ అమ్మ పొడుగుతుందా! తిడుతుందా!' అన్నట్లుంది.''

నా మాటలకు మరోసారి అందరమూ మనసారా నవ్వుకున్నాం. ముగ్గురం నవ్వుకొంటూనే వాకింగ్ ఆపి ఖాళీగా ఉన్న బెంచీ చూసుకొని కూర్చున్నాం.

రోజూ మాకిది అలవాటు. ఇంట్లో ఏమన్నా అర్జెంటు పనులుంటే తప్ప ఈ రిలాక్సేషన్‌కి బాగా అలవాటుపడిపోయాం.



"మీకో విషయం చెప్పనా! ఈమధ్య మా కాలేజి ఫ్రెండ్ వనజ వచ్చింది. ఇంత క్రితం మీకు చెప్పాను కదా. వనజ, మేము పక్క పక్క ఇళ్లల్లో ఉండే వాళ్లమని. వనజ తల్లి శాంతిగారిని కూడా మీరు చూసారు. మాధవి పెళ్లిలో పరిచయం చేసాను. గుర్తుందో లేదో'' నిర్మల అడిగారు.

"ఆ..గుర్తుంది నిర్మలా. ఆయన హార్ట్ ఎటాక్‌తో సడన్‌గా పోతే మీరే బాగా హెల్ప్ చేసారని శాంతిగారు చెప్పారు. ఔను వాళ్లు ఇప్పుడెక్కడ ఉన్నారు?'' కుతూహలంగా అడిగాను.


"అదే చెబుతున్నాను. వనజ ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. ఇద్దరు పిల్లలు. వనజ ఒక్కతే కూతురవ్వడం వల్ల శాంతిగారు కూతురి దగ్గరే ఉంటున్నారు. ఈమధ్య ఏవో పనులుండి ఇక్కడికి వచ్చారు. వనజ ముందు నా దగ్గరకొచ్చి "ఆంటీ, మీరు, అమ్మ మంచి ఫ్రెండ్స్ కదా. మీరేమీ అనుకోకపోతే మీమీద ఒక బాధ్యత పెడుతున్నాను. అమ్మ నాదగ్గరే ఉంటుంది కదా. వయస్సు పెరిగే కొద్దీ చాదస్తం పెరిగిపోతుందాంటీ. ఏమన్నా చెబితే, నా మాటకు విలువలేదంటూ, భోజనం మానేసి కూర్చుంటుంది. అమ్మ చెప్పేవి ఏమీ ఈయనకు ఎక్కవు. ఇద్దరిమధ్య నాకు టెన్షన్ పెరిగిపోతుంది. ఇంట్లోకి అంటూ ఏవో ఒకటి కొని తీసుకువస్తూ ఉంటుంది. అవేమో ఈయనకు నచ్చవు. అమ్మ అనవసరంగా శ్రమపడి తెస్తుంది. 'వద్దు' అంటే చిన్నబుచ్చుకొంటుంది. మీరు ఎట్లా చెబుతారో తెలియదు. అమ్మను కొంచెం మార్చాలంటే మీరు ఏ విషయాన్నయినా సున్నితంగా చెప్పగలరు. సాయంత్రం అమ్మను తీసుకు వచ్చి మీ దగ్గర వదిలి నేను షాపింగ్‌కి వెళ్తాను'' అంటూ వెళ్లి సాయంత్రం తల్లిని తీసుకువచ్చి వదిలి షాపింగ్‌కి వెళ్లిపోయింది.

చాలాకాలం తరువాత చూసానేమో శాంతిగారు బాగా చిక్కినట్లు కన్పించారు. "ఇట్లా అయిపోయారేంటి శాంతిగారూ..ఏమన్నా అనారోగ్యమా?'' ఆప్యాయతగా ఆమె చెయ్యి అందుకొన్నాను. అంతే ఆమె నన్ను పట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చారు. ఆమెను ఓదార్చి, వేడిగా 'టీ' ఇచ్చాను. తాగిన తరువాత మా ఇంటి మంచి చెడ్డలు అడిగి తెల్సుకొన్నారు. పేరు పేరునా అందరి గురించి అడిగారు. నేను చెబుతూనే వనజ చెప్పిన సున్నితమైన సమస్య గురించి ఎట్లా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. నన్ను తేలిక చెయ్యడానికన్నట్లు ఆమే మొదలుపెట్టారు.

"నిర్మలగారూ! తోడులేని జీవితాలు చివరివరకూ ఒకలా వెళ్లవండీ. భార్యాభర్తల బంధం ముందు ఏ బంధమయినా దిగదుడుపే. మనస్సులో విషయాలు భర్తతో చెప్పుకొన్నట్లు పిల్లలతో చెప్పుకోలేం కదా! వనజ, అల్లుడు నన్ను బాగానే చూసుకొంటున్నారు. పిల్లలయితే మరీ అల్లుకుపోతారు. పిల్లలకి నేను స్వతంత్రంగా ఏం చేసినా "అయ్యో! అదెందుకు పెట్టావమ్మా'' అంటూ చిన్న పిల్లలకు చెప్పినట్లు చెబుతుంది. వాళ్లు ఆటల్లో పడి సరిగా తినరు. అన్నీ టైమ్ టు టైమ్ అంటుంది. టైం ప్రకారం పాటించడం మంచిదే. కానీ వాళ్లు తిననప్పుడు, ఆటల్లో లీనమై ఉన్నప్పుడు వెనకాల తిరిగి ఏదో ఒకటి పెడుతుంటే తెలియకుండా తింటారు. అదీ వద్దంటుంది.


ఇంకో విషయం ఏమిటంటే ఇద్దరూ ఉద్యోగస్థులవడం వల్ల అలసి ఇంటికి వచ్చాక ఇంటి విషయాలుగాని, ఇంట్లో వస్తువులు గురించిగాని పట్టించుకొనే తీరిక ఉండదు. ఏదన్నా చెబితే వీకెండ్ చూద్దాం అంటుంది. సాటర్‌డే ఉదయమే లేవడం లేటుగా లేస్తారు. తరువాత పనులన్నీ స్లోమోషన్‌లో అవుతాయి. తీరిగ్గా రెండు దాటిన తరువాత భోజనాలు చేసి పడుకుంటే తిరిగి లేచేది ఏ ఐదు గంటలో అవుతుంది. "అమ్మా, సాయంకాలం వంట చేసుకోవద్దు. బయటకు వెళ్దామంటుంది'' వనజ. సరే అందరం రెడీ అయ్యి బయటపడేసరికి ఏడున్నర, ఎనిమిది అవుతుంది. వెళ్లేటప్పుడు ఇంటి సరుకులు గురించి మళ్లీ గుర్తుచేస్తాను. 'పిల్లలకి భోజనం లేట్ అవుతుంది. వచ్చేప్పుడు తీసుకుందాం' అంటుంది. రెస్టారెంట్ నుండి వచ్చేసరికి తొమ్మిది దాటుతుంది. షాప్స్ అన్నీ క్లోజ్. సండే బట్టలు ఐరన్, పిల్లల పుస్తకాలు ఆర్డర్‌లో పెట్టడం, వారానికి సరిపడా బట్టలు, ఆర్డర్‌లో పెట్టుకోవడంతో గడిచిపోతుంది. మళ్లీ సోమవారం నుండి ఉరుకులూ, పరుగులూ. ఇట్లా రెండు మూడు వారాలు చూసినా లేని సరుకులు రావు. సరే అని అప్పుడు నేను తీసుకు వస్తే వీళ్లకు నచ్చవు.

వారం వారం రెస్టారెంట్స్‌కి వెళ్లి ఐదేసి వేలు దగ్గరగా బిల్ చేస్తారు. "ఎందుకమ్మా. ఇంత దుబారా. చక్కగా ఏదో ఒక ప్రాపర్టీ అమర్చుకోవచ్చు కదా'' అంటే వనజ గయ్‌మంటుంది. "వారం రోజులు అలసిన శరీరాలకి, మనస్సుకు రిలాక్సేషన్ ఇది. ఇంక ఖర్చులంటావా, అందరూ ఇప్పుడిలాగే ఉన్నారు. మీ కాలంలో జరిగినట్లు ఇప్పుడవ్వవమ్మా'' అంటుంది. వదినగారూ, గవర్నమెంట్ జాబ్స్ అయితే పెన్షన్ ఉంటాయి. ఈ ప్రయివేటు



## ఐటమ్ సాంగ్‌లో మనీషా

మాధురీ దీక్షిత్, జూహీ చావ్లాలతో సమానంగా కమర్షియల్ హీరోయిన్‌గా హిందీ సినిమాల్లో రాణించిన మనీషా కొయిరాలా ఇప్పుడు చాలావరకు తెరమరుగైనట్టే. ప్రస్తుతం ఐటమ్ గాళ్‌గా దర్శనమివ్వబోతోంది. 'నగరం' అనే తెలుగు సినిమాలో ఐటమ్ సాంగ్ చేయడానికి రెడీ అయిందిట మనీషా. ఇందుకు గాను ఆమెకి 15 లక్షలు ముడుతున్నాయట. ఓ రకంగా చెప్పాలంటే ఐటమ్ సాంగ్స్ చేసే క్రేజీ తారల రేట్లతో పోలిస్తే ఇది తక్కువే.



జాబ్స్‌కి ఉండవు కదా. నాలుగు రాళ్లు వెనకేసుకోకపోతే చివరి జీవితాలు కష్టమవుతాయి. అదే విషయం ఒకటికి రెండుసార్లు అంటుంటే 'నీకు చాదస్తం పెరిగిపోయిందమ్మా' అంటూ క్లాసు పీకుతుంది. నా మాటకు విలువలేని ఇంట్లో ఉండాలన్పించడం లేదు. కొడుకుల్లేక కదా, వీళ్ల దగ్గరుండి చులకనయిపోతున్నాను. మీరు వనజకు నచ్చజెప్పి నా స్వంత ఇంట్లో నేను ఉండేటట్లు ఏర్పాటు చెయ్యండి వదినగారూ'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకొన్నారు శారద. అప్పుడు నా వంతు నచ్చజెప్పడం ప్రారంభించాను.

"శారదగారూ! మీరు కొడుకుల్లేకే ఈ విధంగా అని అనుకోవద్దు. మా ఆడబడుచు రమ మీకు తెల్సుకదా. ఇద్దరూ అబ్బాయిలే. తను కోడళ్లతో విసిగిపోయి 'ఒక్క కూతురుంటే ఎంత బాగుండేది. కడుపులో కష్టం చెప్పుకోడానికి కూతురుండాలంటోంది' మీకు వనజ దగ్గర కష్టమన్పించడానికి కారణం 'ఇది సరికాదు' అని మీరు వాళ్లకు చెప్పడం, మీరు చెప్పినది వాళ్లకు నచ్చకపోవడం. నాకు తెల్సుండి వనజ ప్రతీ చిన్న విషయానికీ మీమీద ఆధారపడేది. అది పెళ్లికి ముందు. పెళ్లయిన తరువాత భర్తమీద ఆధారపడుతుంది. ఒక విషయంలో మనం, అంటే తల్లులందరం పొరపాటు చేస్తున్నాం అన్పిస్తుంది శారదగారూ! ఆడపిల్లలయినా, మగపిల్లాడయినా పెళ్లిళ్లయ్యేవరకే మనం పట్టించుకోవాలి. తరువాత వాళ్ల జీవిత భాగస్వాములకి వదిలెయ్యాలి. మనం 'ఇది మంచి, అది చెడు' అంటూ సలహాలిచ్చి వాళ్లకు చులకనవ్వకుండా హుందాగా ప్రవర్తిస్తే, ఈ మనస్పర్థలుండవు కదా. చివరివరకూ మనరోజులు ప్రశాంతంగా గడవాలంటే పిల్లలిష్ట ప్రకారమే పోవాలి. మా అమ్మాయి కూడా అంతే. 'అమ్మా నువ్వు వచ్చావు. పిల్లలు నా మాట వినడం లేదు. గారాబం పెరిగిపోయింది' అంటుంది. ఔను. పిల్లలకి అమ్మమ్మల దగ్గర నానమ్మల దగ్గర కాక తల్లుల దగ్గర గారాబం ఉంటుందా? అంటూ నవ్వుతూ కొట్టిపారేస్తాను.

ఇప్పటి పిల్లలకి స్వతంత్ర భావాలు ఎక్కువండీ. మనకి చిన్నప్పుడే పెళ్లిళ్లు చేసేవారు కాబట్టి ఏమీ తెలియక పెద్దవాళ్ల మీద ఆధారపడే వాళ్లం. వీళ్లు చక్కగా అన్నీ ముందే తెల్సుకొని, తరువాత పెళ్లికి సిద్ధమవుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే వాళ్లు మనకన్నా తెలివయిన వాళ్లనే చెప్పాలి. మనం వాళ్లని చూసి గర్వపడాలి శారదగారూ! ఇంక పిల్లల విషయమంటారా? మన పిల్లల్ని మన ఇష్టమొచ్చినట్లు పెంచాం. వాళ్ల పిల్లల పెంపకం వాళ్లకే వదిలెయ్యాలి. ఆర్థిక విషయాలు కూడా అంతే. మనకి అప్పట్లో ఇంతింత జీతాలు ఉండేవి కాదు కాబట్టి ప్రతీ పైసా లెక్కలు పెట్టుకుంటూ ఖర్చు చేసేవాళ్లం. వీళ్లకు లక్షల్లో ఆదాయం, లెక్కలేకుండా వేలల్లో ఖర్చులు అలవాటయిపోయాయి. వనజ అన్నట్లు ఎక్కడో ఒకళ్లిద్దరు తప్ప అందరూ ఇట్లాగే ఉన్నారు.

ఇదంతా మీ ఒక్కరి గురించే చెప్పడం లేదు. మన అందరి తల్లులు కూడా ఈ రకంగా పిల్లలు చెప్పిన మాట వినడం లేదనే అపోహ నుండి బయటపడాలి. చిన్నప్పుడు మనం ఎన్నో చెయ్యాలనుకొంటాం. అప్పుడు సాధ్యపడక వదిలేసిన వ్యాపకాలను బయటకు తీసుకు వచ్చి, మనల్ని మనం బిజీ చేసుకుంటే మనం సంతోషంగా ఉంటాం. మన పిల్లలు కూడా "హమ్మయ్య'' అనుకొంటారు. మీరు ఇప్పుడు వనజతో వెళ్లి, ఇప్పుడు మనం మాట్లాడుకొన్నవి ఆచరించి చూడండి. అప్పుడు కూడా మీకు కష్టం అన్పిస్తే వనజకు నచ్చజెప్పి మిమ్మల్ని ఇక్కడ ఉంచడానికి ప్రయత్నిస్తాను. శారదగారూ పిల్లలు మనకు వెలుగునిచ్చే దీపాలండి. పిల్లలు చిన్న చిన్న తప్పులు చేసినా మనం కడుపులో దాచుకుని మింగెయ్యాలి. అయినా ఏదో ఆవేశంలో ఇట్లా అన్నా మీరు మాత్రం వనజను, పిల్లల్ని వదిలి ఉండగలరా చెప్పండి'' అంటూ నచ్చజెప్పాను. తరువాత అరగంటకు వనజ వచ్చి తల్లిని వెంటబెట్టుకొని వెళ్లిపోయింది.


పదిరోజుల క్రితం ఫోన్ చేసి, "థాంక్సాంటీ అమ్మను ఎట్లా మార్చాలో తెలియదుగాని, ఎప్పుడు చూడండి భగవద్గీత పట్టుకొని కూర్చుంటుంది. చాలా హేపీగా ఉంది'' అని చెప్పింది. శారదగారి కథ ముగించాను.

"లక్ష్మిగారూ! మీరు చెప్పింది ఒక్క శారదగార్కే కాదు. మా అందరికీ కూడా వర్తిస్తుంది'' నిర్మల అన్నారు.

"ఔను నిర్మలా! ఏదో పిల్లల గురించి మనలో మనం సరదాగా చర్చించుకుంటాంగాని, ఎవరి పిల్లల్ని ఎవరు చేతులారా దూరం చేసుకుంటాం చెప్పండి. అమ్మాయిలయినా, కోడళ్లయినా, అబ్బాయిలయినా ఏదో ఉక్రోషం కొద్దీ ఆ నిమిషంలో అనుకొంటాం. మళ్లీ మామూలే. ఒకవిధంగా చెప్పాలంటే తల్లులందరికీ ఒకే రకం ప్రేమ అన్పిస్తుంది. రేపే నాకు రిజర్వేషన్ చేయించమంటాను'' రమ లేస్తూ అన్నారు.

ముగ్గురం ఇంటిదారి పట్టాం.

★



## తేనీగల సంగీతం

తన నాలుగు రెక్కల్ని తేనీగలు నిముషానికి 11,400 సార్లు ఆడించడంవల్లనే అది సంగీతం పాడుతున్నట్లు మనకి వినిపిస్తుందిట. అది సరాసరిని గంటకి 15 మైళ్ల వేగంతో ఎగరగలవట.

## ఐస్‌క్రీమ్ పుట్టుక

ఇవాన్సటన్‌లో 1875లో ఆదివారంనాడు సోడాలని అమ్మరాదని ప్రభుత్వం నిషేధాలు విధించిందిట. ఆ స్థానంలో ఏదో ఒకటి భర్తీ చేయాలని విలియమ్ గార్వ్వుడ్ అనే అతను ఐస్‌క్రీమ్‌ను కనిపెట్టాడట.

-తటవర్తి

